


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### వే'దంత'సారం

**తిండి అనేది** వినడానికీ, చూడటానికీ కూడా చాలా బావుంటుంది. నాలాంటివాళ్ళు అంటే తిండిపోతులు అంతా ఏకీభవించాల్సిన విషయం. కొంతమంది తిండి గురించి మాట్లాడితే విసుగ్గా మొహం పెడ్తారు. కొంతమంది విసుగ్గా 'ఏవిటమ్మా తిండి కోసమే పుట్టామా? బతకాలి కాబట్టి తింటాం'' అంటారు. కొంతమంది స్పెసిమన్లు, అసలు తిండి వండుకోవడం, తినడం అంతా టైం వేస్టు, దాని బదులు ఒక టేబ్లెట్ కని పెడితే సైంటిస్టులు ఎంచక్కా అది చప్పరించి, ఈ ఆకలి అనే గడబిడని కడుపులో అణిచేసి మన పని మనం చేసుకోవచ్చు అంటారు. వారికి ఈ వ్యాసం అంకితం చేస్తాను.

ఏవండీ మహాభారతం అనేది ఉత్కృష్టమైన మహాగ్రంధం కదా! నభూతో న భవిష్యతీ.. అంటారు అలాంటి దాన్నే గారెలతో పోల్చారు పెద్దలు. 'వింటే భారతం వినాలి, తింటే గారెలే తినాలి' అని. కదా.. ప్రపంచంలో ఏ అందమైన అద్భుతమైన విషయాల్ని అయినా 'తిండి' తోనే పోలుస్తారు మనిషి నాడీ కేంద్రం మీద త్వరితగతిన పనిచేసి, ముక్కుల నుండి లోపలికి వాసనలు వెళ్ళి, నాలిక మీద నీళ్ళూరి, కళ్ళల్లోకి వెలుగులు ప్రసరించి, మెదడులో ఆనందం అనే భావన కలగచెయ్యడానికి. దీన్నే 'రసానందం' అని అంటారు.

ఉదాహరణకి ''సశ్యశ్యామలమూ, హరిత భరితమూ అయిన ధరిత్రి, ఆ భానుని లేలేత కిరణాలకై నునుసిగ్గుతో ఎదురు చూస్తోంది. అందుకు సమయముంది అన్నట్లు వెండి గిన్నెలో తళుకులూనుతూ తారకలు కన్ను గీటాయి''

ఇది చదివితే మనసులో ప్రశాంతమైన భావాలు కలుగుతాయి.

అదే నేను రాస్తే,

''తన వెలుస్తున్న నల్ల రంగు చీరమీద అమ్మ చిట్టొడియాలు పెట్టినట్లు, ఆకాశం నిండా చుక్కలు మెరుస్తున్నాయి. చంద్రుడు గాజు గిన్నెలో సగం కోసిన జున్ను ముక్కలా, భూదేవిని చూసి కన్ను గిటాడు. పచ్చని నూగారుతో నేల తల్లి అరిటాకు విస్తరి పరిచి అధరువులకై వేచి చూస్తోంది. తోడు పెట్టిన గెడ్డ పెరుగుని కవ్వంతో చిలుకుతున్నట్లు మేఘాలు, విరుగుతూ, పలచనై, అరిటాకులో అమృతంలా కిందకి వర్షధారులై జారుతున్నాయి.

కజ్జికాయలని తలపించే కొండలూ, వాటి మీద నువ్వులద్దిన అరిసెల్లా సేద్యం చేసిన చేలూ, పైపైన విచ్చుకున్న క్యాబేజీ పూలూ, వరిపిండితో జంతికలు తిప్పుతునట్లు, కొండలమీద నుండి జారే సెలయేళ్ళూ'' అని నేను రాసాననే అనుకోండీ

నోట్లోకి లాలాజలం, మనసులోకి కమ్మని భావం ఒకేసారి వస్తాయి. కమనీయం అంటారు కవులు. అంటే కమ్మని భావన. అసలు మీగడ కమ్మన, నెయ్యి కమ్మన, వెన్న కమ్మన ఇంత కమ్మగా కవిత్వం చెప్పిన వాడు తిమ్మన.

మాయాబజార్ సినిమా చూడని ఆంధ్రుడు లేదా తెలుగువాడు వుంటాడనుకోను. చూసిన ప్రతి వాళ్ళకీ మొదట గుర్తొచ్చి, పెదవులమీదకి నవ్వు తెప్పించేది 'వివాహభోజనంబు' సీన్.. కాదంటారా?

"అమ్మా ఇంతింత లడ్డూలూ, అరిసెలూ, గారెలూ నిజంగా తిన్నాడా? ఎస్.వి.రంగా వంగా రావూ?" అని మా పిల్లలు అడిగేవారు. ఈ దృశ్యం కె.వి రెడ్డిగారూ, పింగళిగారూ పెట్టడానికి అసలు కారణం, గోంగూర పచ్చడి ప్రస్తావన కోసం.

"ప్రభువులు అది లేనిదే ముద్ద ముట్టరు" అంటే.

"చిత్తం చిత్తం.. అర్థమయింది" అంటారు చిన్నమయ శిష్యులు.

"ఏం అర్థమయింది?" అంటే

"నరమావసం.. నరమావసం" అంటారు

"అయ్యో.. అఘోరించినట్లే వున్నాయి మీ తెలివితేటలు. ఆంధ్రామాత గోంగూర" అంటారు శర్మా, శాస్త్రీ.

పంజాబ్ దగ్గిర పుట్టి, యూనియన్ టెరిటరీ దాటి కురుక్షేత్రంలో యుద్ధం చేసిన ఆ పంచపాండవులూ వారి కజిన్స్ కౌరవులూ, గోంగూర పచ్చడి లేనిదే ముద్ద ఎత్తరా? ఆఫ్గనిస్తాన్ కాబూల్ నుండొచ్చిన గాంధారి కోడళ్ళకి గోంగూర పచ్చడి నేర్పించిందా? ఆ లాజిక్‌లు అడగొద్దు. అచ్చమైన తెలుగువాడు తీసిన సినిమా తెలుగు సినిమాలో 'గోంగూర' ప్రాసస్త్యం చెప్పి తీరాల్సిందే అంతే. అందరికీ గోచీపోసి పంచెలు కట్టించి, రాక్షసుడి కడుపులో జఠరాగ్ని రగిల్చి పీటమీద కూర్చుని, పులిహోరా, గారెలూ పాయసాలూ భుజింప చేయాల్సిందే" అదీ మన తెలుగు సినిమా.

"చక్కెర కలిపిన తియ్యని కమ్మని తోడు పెరుగు తెలుగూ... చక్కని పలుకుల సొబగుల నెడతల హంస హొయల బెళుగూ. నన్నయ, తిక్కన, ఎర్రన పితికిన ఆవుపాల పొదుగూ. చదువుల తల్లికి సుమధుర శైలికి పుట్టినిల్లు తెలుగూ" అన్నారు జొన్నవిత్తుల.

మనం తిండితో పోల్చకపోతే తెలుగుభాష మీద ఆ తీపి ఎందుకుంటుందండీ?

గుండమ్మ కథ చూద్దామా? 'రమణారెడ్డి "ఏవిటయ్యా ఆ పెసరట్టు వెయ్యడం?" అంటూ పెద్ద పెనం అంత పెసరట్టు వేసి, దానిమీద వసంతంలో పూలజల్లులా ఉల్లీ, పచ్చిమిరపా, అల్లం ముక్కలు జల్లుతుంటే, నోరూరిపోదూ?

అందాల రాముడిలో సావాలమ్మ పెసరట్టు, అసలు బాపూగారు చూపించిన లెవలే వేరు. ఎవరికైనా వెళ్ళి ఆకు పట్టుకుని లైనులో నిలబడాలనిపిస్తుంది.

ముత్యాల ముగ్గులో సంగీతతో, భాగవతం చదివించుకున్న ఆవిడ "పాదునుండి సొరకాయలు కోసుకెళ్ళు అమ్మా, పాలు పోసి వండితే పిల్లలు కమ్మగా తింటారు" అంటుంది.

ఏం సొరకాయ కోసుకెళ్ళు అమ్మా పిల్లలకి కూరొండి పెట్టు, పచ్చడి మెతుకులేం పెడ్తావు రోజూ?" అని వారి దారిద్ర్యాన్ని కళ్ళకి కట్టినట్లు రాయలేక కాదు ముళ్ళపూడి వెంకట రమణగారు, "పాలు పోసి వండు" అని చెప్పించారు. అంటే మన తెలుగు పద్ధతిలో పులుసు ఆవపెట్టి వండటం, ఇంకోటి పిండి బెల్లం, పాలూ పోసి వండటం. మొదటిది వేడి చేస్తుంది. రెండోది చలవచేస్తుంది. ఇప్పుడు పిల్లలకి కావల్సింది చలువ. సొరకాయ కోస్తుంటే, ఆ ఇంటి యజమాని, ఏదీ ఉట్టిగా ఇచ్చే స్వభావం లేనివాడు. ఆమెని బలాత్కారం చెయ్యబోవడం, ఆమె మీదకి కొడుకు రాజూ, అతని దోస్త్ అంజి అనే

కోతీ వెళ్ళి, దేహశుద్ధి చేసే వేడి వేడి సీన్ ఎలాగూ వుంది నెక్స్ట్ అని చెప్పడం అన్నమాట. ఇంత భావం ఉంటుంది అండీ తెలుగు వాడి, వాడి డైలాగులో అర్ధం చేసుకుంటే, చేసుకున్నవారికి చేసుకున్నంతా.

ఇంక విశ్వనాథ్‌గారు తక్కువా? ఆత్మగౌరవం సినిమాలో "మారాజులొచ్చారు, మా ఇంటికొచ్చారు, మనసున్నవారంట, మా మంచి వారంట" అన్నపాటలో "ముద్దపప్పే కలుపుకోండి, కొత్త ఆవకాయే నంజుకోండి. అత్తమ్మ వండిన గుత్తి వంకాయండి మచ్చు చూసారంటే మళ్ళీ తెమ్మంటారు" అని ఆరుద్ర గారి చేత ఆత్మగౌరవం సినిమాలో, టైటిల్‌కి తగ్గ పాట రాయించారు.

వేదాంతం రాఘవయ్యగారు రుణానుబంధంలో జూనియర్ సముద్రాల గారిచేత 'అందమైన బావా.. ఆవుపాల కోవా పాటలో, "రాగాల రవ్వట్టూ, భోగాల బొబ్బట్టూ, నా ప్రేమ పెసరట్టూ భుజించవోయ్" అనిపించారు. రవ్వట్టు, బొబ్బట్టు, పెసరట్టు ఈ మూడూ తెలుగు వాళ్ళ ప్రైడ్ కాదుటండీ? పెసరట్టూ, ఉల్లీ, అల్లంతో కలిపి వేసి, ఉప్మా కాంబినేషన్‌గా పెట్టుగల మరో దేశం వాడ్ని చూపెట్టండి అసలు నేత్తో చేసిన జీడిపప్పు ఉప్మా, ఐదు నిమిషాల్లో మహత్తరంగా తయారయ్యే ఈ పదార్థం కనిపెట్టిన వాడికి ఇవ్వద్దండీ అసలు నోబుల్ ప్రైజ్?

'ఏది నిజం' సినిమాలో "గుత్తొంకాయ కూరో బావా.. కోరి వండినావోయ్" అనిపించారు మాస్టర్ వేణుగారు. "ఆహా ఏమి రుచీ తినరా మైమరచీ" అనిపించారు. ఎస్.వి కృష్ణారెడ్డిగారు. అసలు ఆ ఆది శంకరుడినే, వంకాయతో పోలిస్తే కానీ ఆయన స్టాటస్ తెలీలేదు జనానికి. వంకాయ వంటి కూర శంకరుని వంటి దైవం.." అన్నారు.

యమగోలలో తాతినేని రామారావుగారు, సాక్షాత్తూ యముడికే గోంగూరా, ఆవకాయా ఎర్రగా కలిపి జయప్రద చేతుల మీదుగా ఆ రుచిని ఆస్వాదింపజేస్తే, యమలీలలో క్రిష్ణారెడ్డిగారు, 'హిమక్రీమ్'లంటూ ఐస్‌క్రీమ్‌లని యముడికి అలవాటు చేసారు.

భూలోకానికి రాగానే యముడు చిత్రగుప్తుడితో "కడుపులో ఒక మాదిరిగా వుంది చిత్రగుప్తా" అంటే చిత్రగుప్తుడు "నాకు రెండు మాదిర్లుగా వుంది ప్రభూ" అంటాడు. యమగోలలో డివి. నరసరాజుగారి స్క్రిప్టు మరి.

సావాసగాళ్ళు సినిమాలో ఉలవచారూ, కృష్ణగారు చేసే గుత్తి వంకాయలని అలా ఇలా వర్ణించలేదు బి.ఏ సుబ్బారావుగారు. సూపర్ స్టార్ గుత్తివకాయ వండుతుంటే, ప్రేక్షకుల నోట్లో నీళ్ళూరకమానవు. నేనా సినిమా ఎన్నిసార్లు చూసానో ఆ సీన్ కోసం.

మా తండ్రివంటి డా. డి.రామానాయుడుగారిని తలుచుకోవాలిక్కడ. ఆ సినిమా అంటే ఆయనకి ప్రత్యేకాభిమానం. ఆ సినిమాలో స్నేహం చూపించినట్లు, చూపించాలమ్మా స్నేహం అంటే ఏం తీసాడు మా సుబ్బారావు?" అనేవారు. ఆయన కూడా మంచి భోజన ప్రియులు.

"రమణీ! నానక్ రామ్ గూడాలో చిన్న తోట వేశా. వంకాయలు నవనవలాడ్తూ పెరిగాయి. పద కోసుకొద్దాం" అని సిటింగ్‌లోంచి బయల్దేరతీసేవారు. నిజంగానే స్టూడియోలో ఓ ఆవూ, దూడా, కూర మడులూ, అందులో తోటకూరా, గోంగూరా, వంకాయలూ లాంటివి వుండేవి. అవన్నీ స్వయంగా ఆయన కోసి నా కార్‌లో పెట్టించి" రేపు మరి గుత్తివంకాయ వండి తేవాలి అనేవారు.

నేను షూటింగ్ లొకేషన్‌కి వండి పట్టుకెళితే, మాతో కూర్చుని ఆస్వాదిస్తూ భోంచేసేవారు. మధుమాసం షూటింగ్‌కి మలేషియా వెళ్ళినప్పుడు కూడా 'వెజిటేరియన్ హోటల్ ఎక్కడుంది రమణికి?" అని వెదికి 'నాకోసం పొంగల్ వడా లాంటివి పంపించేవారు. ప్రొద్దుట బ్రేక్‌ఫాస్ట్‌కి నేనూ డైరెక్టర్ చంద్రసిద్దార్థా ఆయనతోబాటు, వళ్ళార్ కొట్టంలోని ఆయన చెన్నై,

స్వగృహంలో కూర్చుంటే, మాకు వడ్డించి కానీ తను వడ్డించుకునేవారు కారు. "ఈ ఫుడ్ ఒకటే నా వీక్‌నెస్ అమ్మా. ఎక్కడ ఆపాలో తెలీదు" అనేవారు.

నాన్‌వెజ్ ఐటెమ్స్ ఎక్కువ తినేవారు. కరివేపాకు ఫ్రెష్‌గా చెట్టునుండి కోసి నేతిలో బాగా వేయించి, పప్పులో పైన వెయ్యమని వంటవాళ్ళకి చెప్పేవారు. అలాగే ఏ సీజన్ ఫ్రూట్, ఆ సీజన్‌లో తప్పక తినాలని, మావిడిపండ్లూ, సీతాఫలాలూ, చక్కెరకేళి అరటిపళ్ళు తినిపించేవారు.

నేను తిండిపోతునో, లేక నా ప్రొడ్యూసర్లూ డైరెక్టరూ అంతా అలా ప్రత్యేకంగా చూసేవాళ్ళోకానీ, కె.ఎస్. రామారావుగారికీ, భోజనం చేసేటప్పుడు చుట్టూ బోలెడు మంది వుండాలి. ఇంటికి పిలిచి రకరకాలు చేయించి పెట్టేవారు. ఇంక నాగబాబుగారైతే, మా సీతామాలక్ష్మి సీరియల్ టైంలో "పూర్ణా మెస్ నుండి ఇడ్లీలు ఫలానా సౌత్ మెస్ నుండి పెసరట్టు, సదరన్ స్పైస్ నుండే భోజనం. అప్పుడే చేసిన కొబ్బరి పచ్చడి వుండాలి. ఇలా చెప్పేవారు. అంతేకాదు. ఎవరైనా ఏ ఐటెమ్ అయినా బాగా చేస్తాం అంటే అక్కడే అన్నీ తెప్పించి వండించి పెట్టేవారు. నేను ముస్లింల షీర్ కుర్మా ఇష్టం అన్నానని, ఒకావిడని పట్టుకొచ్చి లొకేషన్‌లో షీర్ కుర్మా చేయించి పెట్టించారు.

అసలు దీనిమీద ఓ జోక్ కూడా వుంది. "రమణీగారూ హీరో హీరోయిన్ పానీపూరి తినడం బండి దగ్గర... రాసారు.. ఇంట్లో కూర్చుని మాట్లాడకూడదా?" అని అడిగేవారు.

"ఇద్దరూ పానీపూరీ తినడం, హీరోయిన్ తినలేక అవస్తపడటం, హీరో ఆట పట్టించడం ఇవన్నీ వాళ్ళు కలిసి సరదాగా గడుపుతున్నారని చెప్పడానికి సార్.. విషాదగీతం వస్తుండగా ఇంట్లో ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకుంటే ఏం వుంటుందీ" అనేదాన్ని.

"రమణీగారూ పానీపూరీ తినాలనుంది అని నాతో చెప్పొచ్చుగా మొహమాటం దేనికి?" అని నవ్వేవాళ్ళు. ఆ రోజు సెట్‌లో అందరికీ పానీపూరీ పార్టీ అనమాట.

బయట నుండి చాట్స్ తెప్పించి, ముందు నాకూ, ప్రవల్లికకీ, కమేడియన్ ఆకెళ్ళకీ, అందరికీ దహీ పూరీ చాట్‌లాంటివి, నింపి స్వయంగా మా ప్లేట్‌లోనో, వీలైతే నోట్లోనో వేసి తినిపించి, మేం తింటుంటే ఆనందపడేవారు. ముగ్గురు రత్నాల్లాంటి బిడ్డలని కన్న చిరంజీవిగారి అమ్మగారు, అంజనాదేవిగారు కూడా కొడుకు కోసం స్వయంగా వంట చేసి పంపేవారు సెట్‌కి. అమ్మ మీ కోసం వెజిటేరియన్ గుర్తు పెట్టుకుని పంపింది" అనేవారు నాతో, అవన్నీ గోల్డెన్ మెమెరీస్, వాళ్ళు ఎన్ని లక్షలు ఇచ్చారన్నది కాదు, ఎలా ఆదరించారు. కడుపు చూసి అన్నం పెట్టారా? అన్నదే మన జ్ఞాపకాలల్లో మిగిలిపోతుంది.

అసలు మా తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఏ పనికైనా పొట్టచేత పట్టుకొచ్చిన వాడు మొదటి రోజు పొంగల్ తినగానే ఇంక ఈ రంగానికి కట్టుబడి వుంటాడు, వెనక్కి తిరిగి వెళ్ళడని మా అభిప్రాయం. ఏదైనా తిండిలోనే వుందండి.

మా ఇంటికి నా రచనలు చదివి నన్ను అభిమానించి చూడాలని వస్తారు కొందరు మా అమ్మ వంట గదిలోంచి వచ్చి "ఎప్పుడు తిన్నారో ఏమో గోంగూర పులుసుకూరా, పప్పూ, అందులోకి నాలుగు ఊరమిరపకాయలూ, గుమ్మడి వడియాలూ వేయిస్తా. రెండు ముద్దలు తిని వెళ్ళండి. మంచి నీళ్ళకి అడ్డు అంటుంది.

అంతేకాదు తినేదాకా వూర్కోదు. దాంతో వాళ్ళు నా అభిమానులు కాదు. మా అమ్మ అభిమానులైపోతారు. ఆదరణగా ఓ ముద్ద అన్నం.. ఇంతకన్నా భావ ప్రకటనలేం కావాలి? కోటి విద్యలు కూటి కొరకే. లక్షాధికారి ఐనా లవణామన్నమేగాదా? అన్నాడు రామదాసు. ఆ లవణం అన్నానికే ఇన్ని తిప్పలు. కోటీశ్వరుడైనా వెండీ, బంగారాలు తినడు. "ఆకలేసినప్పుడు


జవ్వాదీ, మల్లెలూ, మంచి గంధం వాసనలు కావు. పప్పుచారు వాసనలు కోరుకుంటుంది మనసు" అన్నారు గుడిపాటి వెంకటాచలం.

బందరులో తిన్న పెసరపుణుకుల రుచి గురించి విశ్వనాథ సత్యనారాయణగారు ప్రత్యేకంగా చెప్పుకున్నారు.

కష్టపడి సంపాదించినది. రకరకాల పలహారాలూ, వంటలూ తినడానికే అని భావించానన్నారు కేసరీ కుటీర్‌లు స్థాపించిన కేసరిగారు.

మీ ఇంటికి ఎవరైనా వచ్చి వెళ్తే మీ ఇంట్లో ఎంత ఖరీదు షో పీసెస్ వున్నాయి? ఎంత కళాత్మకంగా ఇల్లు కట్టుకున్నారో కాదు, మీరెంత ఆదరణ పూర్వకంగా మాట్లాడారూ? ఎంత ప్రేమగా తినడానికి పెట్టారూ? అన్నది గుర్తుంచుకుంటారు. సృష్టిలో తియ్యనిది తిండేనోయ్ అంటా! మీరేమంటారు ఇంత విన్నాకా? ఔనౌను అంటారు..

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4